క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న ప్రిన్సిపాల్ ఆశారమణి

విజయనగరం రూరల్: పాలిసెట్ – 2023 ప్రవేశ పరీక్షకు సంబంధించిన స్టడీ మెటీరియల్‌ను విజయనగరం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ జె.ఆశారమణి గురువారం పంపిణీ చేశారు. ప్రభుత్వం నుంచి సరఫరా అయిన స్టడీ మెటీరియల్‌ను కోచింగ్ తరగతులకు హాజరవుతున్న విద్యార్థులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు నాగకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల పరిశీలన



వేతనదారులతో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వరూపారాణి

డెంకాడ: మండలంలోని చింతలవలస పంచాయతీలో జరుగుతున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పనులను ఎంపీడీఓ స్వరూపారాణి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వేతనం గిట్టుబాటు కావాలంటే రెండు పూటలా పనులు చేపట్టాలన్నారు. అనంతరం మస్తర్లు పరిశీలించారు.

హిందూ ధర్మ రక్షణ సమితి కృషి అభినందనీయం



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: మన సనాతన సంప్రదాయాలు, సంస్కృతిని పరిరక్షించడంలో హిందూ ధర్మ రక్షణ సమితి చేస్తున్న కృషి ఎంతైనా అభినందనీయమని ఉప సభాపతి కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. హిందూ ధర్మ రక్షణ సమితి ఆధ్వర్యంలో మే 14న నగరంలోని కోట జంక్షన్ నుంచి చేపట్టనున్న హనుమాన్ ర్యాలీకి సంబంధించిన వాల్‌పోస్టర్లను గురువారం తన నివాసంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో సమితి ఆర్గనైజింగ్ కార్యదర్శి ఆబోతుల శ్యామ్, రాష్ట్ర కార్యదర్శి వేణుగోపాల్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రామరాజు, పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

నేడు సచివాలయ భవనాలు ప్రారంభం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని వల్లూరు, రామతీర్థం గ్రామాల్లోని గ్రామ సచివాలయాల భవనాలను శుక్రవారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. ఎంపీ బెల్లాన చంద్రశేఖర్‌తో పాటు జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సూర్యనారాయణరాజు హాజరుకానున్నారని తెలిపారు.


గంట్లాంలో 'జగనన్నే మా భవిష్యత్..'



ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ పాలనపై అవగాహన కల్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, గృహసారథులు

డెంకాడ: మండలంలోని గంట్లాం గ్రామంలో 'జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్‌సీపీ హయాంలో జరిగిన మేలును వివరించారు. అలాగే ఇళ్ల యజమానుల మద్దతుతో జగనన్న స్టిక్కర్లను అతికించారు. కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ నాయకులు రమణరాజు, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ పండగ



అమ్మవారి ఘటాలను ఊరేగిస్తున్న గ్రామస్తులు

కొత్తవలస: మండలంలోని చిన్నిపాలెం గ్రామ దేవత ముత్యాలమ్మ పండగ అనుపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులు అమ్మవారి ప్రతిమలు,ఘటాలను మేళ తాళాల మధ్య భక్తి శ్రద్ధలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కోలాటం, సాంప్రదాయ నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ ఆర్.పద్మలత, నాయకులు పవన్, సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యం

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి



ప్రభుత్వ పథకాలపై లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమన్నారు. నగరంలోని 21వ డివిజన్ నాగవంశం వీధిలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో కోలగట్ల పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్థానికులు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం కోలగట్ల స్థానిక నాయకులతో కలసి ఇంటింటికీ వెళ్లి ఒక్కో కుటుంబానికి సంక్షేమ పథకాల వల్ల ఎంత లబ్ధి చేకూరినదీ వివరించి, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కార్పొరేటర్ కనకల నాగవల్లి మాట్లాడుతూ, గడప గడపకు.. కార్యక్రమం ద్వారా ప్రజలను నేరుగా కలుసుకుని వారి ముఖాల్లో ఆనందం చూస్తున్నామన్నారు. ప్రభుత్వపరంగా లబ్ధి పొందుతున్న ప్రతిఒక్కరూ తమ సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అందిస్తున్న నీతివంతమైన, సంక్షేమ పాలనను ప్రతి కుటుంబం స్వాగతిస్తోందన్నారు. స్థానికంగా ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించడంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి కృషి ఎనలేనిదని కొనియాడారు. 20వ డివిజన్ కార్పొరేటర్ కంటుభుక్త తవిటిరాజు మాట్లాడుతూ, తమ డివిజన్ పరిధిలో పేదవారందరికీ ప్రభుత్వం ద్వారా లబ్ధి చేకూరడంతో ఆనందం వ్యక్తమవుతోందన్నారు. మధ్యవర్తులు, దళారులు లేకుండా నేరుగా లబ్ధిదారుల ఖాతాలకే సంక్షేమ పథకాల నిధులు జమవుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, నాగవంశం కార్పొరేషన్ డైరెక్టర్ అవనాపు లక్ష్మణరావు, అవనాపు రాజు, జోనల్ ఇన్‌చార్జ్ కాళ్ల సూరిబాబు, కనకల గిరి, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా సంక్షేమం

విజయనగరం రూరల్: పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. మండలంలోని గుంకలాంలో గడప గడపకు మన ప్రభుత్వం.. కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ, సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తూ, ముఖ్యమంత్రి సందేశంతో కూడిన బుక్‌లెట్లను పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి జగనన్న అమ్మఒడి, రైతుభరోసా, అందరికీ ఇళ్లు, రైతు, పొదుపు రుణ మాఫీ, పింఛన్ల పెంపు పథకాలతో పాటు, ఆసరా, విద్యాదీవెన, వసతిదీవెన, ఈబీసీ నేస్తం, చేదోడు లాంటి మరెన్నో పథకాలను అమలు చేసి పేదోడి ముఖాల్లో వెలుగులు నింపుతున్నారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే జగనన్నను మరోసారి గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, సర్పంచ్ కునుకు వెంకటరావు, ఎంపీడీఓ గంటా వెంకటరావు, పార్టీ సీనియర్ నాయకులు లెంక జగ్గునాయుడు, కాళ్ల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



విజయనగరం రూరల్: లబ్ధిదారులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ఉన్నత రంగాల్లో రాణించాలి



ఈశ్వరరావును అభినందిస్తున్న సంస్కృత కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పాలూరి గౌరీశ్వరరావు

విజయనగరం టౌన్: విద్యార్థులు ఉన్నతరంగాల్లో రాణించాలని మహారాజా ప్రభుత్వ సంస్కృత కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ పి. గౌరీశ్వరరావు ఆకాంక్షించారు. కళాశాలకు చెందిన రేపల్లె ఈశ్వరరావు చెన్నై కన్యకాపరమేశ్వరి సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాల తెలుగు విభాగం, సృజన తెలుగు భాషా మండలి సంయుక్తంగా 'దేశాభివృద్ధి – యువత పాత్ర ' అనే అంశంపై ఇటీవల నిర్వహించిన వక్తృత్వ పోటీల్లో ప్రథమస్థానం కైవసం చేసుకున్నాడు. ఈ మేరకు విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు జిల్లా ఖ్యాతిని జాతీయస్థాయిలో ఇనుమడింపజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాయితీని సద్వినియోగం చేసుకోండి..

- కార్పొరేషన్ అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావు



మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు

విజయనగరం: రానున్న ఆర్థిక సంవత్సరానికి (2023–24) సంబంధించి ముందుగా పన్ను చెల్లించిన వారికి ఐదు శాతం రాయితీ కల్పిస్తున్నామని, ఈ అవకాశాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ పీవీడీ ప్రసాదరావు తెలిపారు. కార్పొరేషన్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో గురువారం అయన మాట్లాడుతూ... ఆస్తి, ఖాళీ స్థలాల పన్నుపై ఐదు శాతం రాయితీ ఈ నెల 30 వరకు ఉంటుందన్నారు. 2021 – 22 ఆర్థిక సంవత్సరంలో రూ. 24 కోట్ల 78 లక్షల మొత్తాన్ని ఆస్తి పన్ను రూపంలో వసూలు చేయగా... 2022 – 23 ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 38 కోట్ల 9 లక్షలు వసూలైందని తెలిపారు. గతేడాది కన్నా ఈ ఏడాది రూ. 13 కోట్ల 34 లక్షల మొత్తాన్ని అధికంగా వసూలు చేయగలిగామని చెప్పారు. ఇందుకు సహకరించిన ఆస్తి పన్నుదారులకు, సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అదేవిధంగా గడిచిన ఆర్థిక సంవత్సరం మొదటి నెలలో ప్రభుత్వం కల్పించిన రిబేట్ సౌకర్యాన్ని 7,800 మంది వినియోగించుకుని రూ.2 కోట్ల 52 లక్షలు చెల్లించారని గుర్తు చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను ఐదు శాతం రిబేటు సౌకర్యాన్ని ప్రకటించిన తర్వాత ఇప్పటివరకు రూ.2 కోట్ల 78 లక్షలు వసూలైందని చెప్పారు. మిగిలి ఉన్న పది రోజులలో భవన యజమానులు కూడా ఆస్తి, ఖాళీ స్థలాల పన్నులను చెల్లించి ఐదు శాతం రిబేటు సౌకర్యం పొంది, నగర అభివృద్ధికి సహకరించగలరని కోరారు. ముందస్తు పన్ను చెల్లింపులకు కార్పొరేషన్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ విధానంలో కూడా పన్ను చెల్లించుకోవచ్చన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి..



క్షయ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న డాక్టర్ సూర్యనారాయణ

విజయనగరం ఫోర్ట్: క్షయరోగులు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ ఎస్. సూర్యనారాయణ అన్నారు. గురువారం స్థానిక రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయంలో 69 మంది క్షయరోగులకు నిక్షయ్ పాత్ర కార్యక్రమంలో భాగంగా పౌష్టికాహారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మందులు క్రమం తప్పకుండా వాడితే క్షయ వ్యాధి పూర్తిగా నయమవుతుందన్నారు. క్షయవ్యాధి లక్షణాలు కనిపించిన వెంటనే కఫం పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ కేఆర్‌డీ ప్రసాదరావు, కార్యదర్శి సత్యం, దాతలు నారాయణం శ్రీవల్లి, మేకా కాశీవిశ్వేరుడు, రెడ్‌క్రాస్ కో ఆర్డినేటర్ గౌరీశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాధాన్యతాంశాలపై నిర్లక్ష్యం తగదు..

- కార్పొరేషన్ కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు



మాట్లాడుతున్న కమిషనర్ రెడ్డి శ్రీరాములనాయుడు

విజయనగరం: ప్రభుత్వ ప్రాధాన్యతాంశాల అమలులో నిర్లక్ష్యం తగదని సచివాలయ కార్యదర్శులకు కార్పొరేషన్ కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు అన్నారు. నగరంలోని 38వ నంబర్ సచివాలయంలో 10, 32, 33, 34, 35, 36, 37, 38 సచివాలయాల కార్యదర్శులతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్షేత్రస్థాయిలో ప్రజలు, లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాల మంజూరులో సచివాలయాలు కీలక భూమిక పోషిస్తున్నాయన్నారు. అలాగే సులభతరమైన పౌరసేవలు అందించడంలో కార్యదర్శులు ఉదాసీనంగా ఉండరాదని సూచించారు. రికార్డుల నిర్వహణలో, సిటిజన్ చార్ట్ అములులో నిర్లక్ష్యం తగదన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఆయా సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల: పట్టణంలోని ఎంజేపీఏపీ బీసీ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేబీబీ రావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఎంపీసీలో 60, బైపీసీలో 40, సీఈసీలో 40 మొత్తం 140 సీట్లు అందుబాటులో ఉన్నట్లు పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ నుంచి వచ్చే నెల 18 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. వచ్చే నెల 28న రాత పరీక్ష నిర్వహించి, జూన్ 10న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. జూన్ 14 నుంచి 17 వరకు ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. ఈ విద్యా సంవత్సరంలో పదో తరగతి పరీక్షలు రాసి, 17 సంవత్సరాల వయసు మించని విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. విజయనగరం, శ్రీకాకుళం, పార్వతీపురం – మన్యం జిల్లాలకు చెందిన బాలికలు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సూచించారు. అర్హులైన విద్యార్థులు హెచ్‌టీటీపీ:// ఎంజేపీఏపీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్/ అనే వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు.

జాతీయ పురస్కార గ్రహీతకు కోలగట్ల అభినందనలు



మణికంఠను అభినందిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: టీసీఎస్ కంపెనీ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పాల్గొని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము చేతుల మీదుగా జాతీయ అవార్డు దక్కించుకున్న కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి కొంతల మణికంఠను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అభినందించారు. ఈ నెల 17న ఢిల్లీలో జరిగిన అవార్డుల ప్రధానోత్సవంలో పాల్గొని గురువారం నగరానికి చేరుకున్న విద్యార్థి కోలగట్లను ఆయన స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా కోలగట్ల విద్యార్థిని అభినందిస్తూ, భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందుతోందన్నారు. మణికంఠ సాధించిన ఘనతలో కీలకపాత్ర పోషించిన ఉపాధ్యాయులను కోలగట్ల అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆర్.శంకరరావు, ఉపాధ్యాయులు వి.రమణ, జీవీబీ సూర్యనారాయణరాజు, రామునాయుడు, పీడీ గోపాల్ పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రంలో తనిఖీ



శిక్షణ కేంద్రంలో తనిఖీలు చేస్తున్న అధికారులు

శృంగవరపుకోట: స్థానిక మండల సమాఖ్య కార్యాలయంలో భారత్ డైనమిక్స్ లిమిటెడ్ వారి సహకారంతో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాన్ని వైఎస్సార్ క్రాంతి పథం అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. తొలివిడతలో 30 మంది మహిళలకు శిక్షణ పూర్తికాగా, ప్రస్తుతం మరో 30 మంది శిక్షణ పొందుతున్నారు. శిక్షణలో టైలరింగ్‌కి సంబంధించిన కిట్లను పరిశీలించారు. అనంతరం శిక్షణ పొందుతున్న వారితో మాట్లాడి శిక్షణ ఎలా నడుస్తోంది, స్నాక్స్, మధ్యాహ్న భోజనం అందిస్తున్నారా లేదా, ఇతర సదుపాయాల గురించి అడిగి తెలుసుకున్నారు. వారు కుట్టిన దుస్తులు పరిశీలించారు. వెలుగు ఎస్.కోట ఏరియా కో–ఆర్డినేటర్ ఎం.జయశ్రీ, జేడీఎం మార్టిన్, ఎస్‌వీఈపీ ఏపీఎం అనూరాధ, పాల్గొన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి

- పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు



మాట్లాడుతున్న పీటీసీ ప్రిన్సిపాల్ ఆనందబాబు

విజయనగరం క్రైమ్: వేసవికాలంలో తరచూ అగ్నిప్రమాదాలు జరుగుతుంటాయని, ఈ విషయంలో ప్రజలందరూ జాగ్రత్తలు తీసుకోవాలని పోలీస్ ట్రైనింగ్ కాలేజ్ ప్రిన్సిపాల్ టి. ఆనందబాబు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల ముగింపు సందర్భంగా గురువారం స్థానిక జిల్లా అగ్నిమాపకశాఖ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అగ్ని ప్రమాదాలు సంభవించేటప్పుడు చేపట్టాల్సిన నివారణ చర్యలు, ఉపయోగించే పరికరాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అగ్నిమాపకశాఖ జిల్లా అధికారి కె.వినయ్ కుమార్, సహాయ జిల్లా అగ్నిమాపక అధికారి వి.సోమేశ్వరరావు, వివిధ కళాశాలల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు
- పాఠశాలకు రూ.60 వేల క్రికెట్ కిట్ అందజేత



విద్యార్థులకు క్రికెట్ కిట్ అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: చదువుతో పాటు క్రీడల్లో రాణించే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని, క్రీడలకు సీఎం వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఎంతో ప్రోత్సాహం ఇస్తున్నారని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలకు జిల్లా పరిషత్ నిధులు రూ.60 వేలతో క్రికెట్ కిట్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లోని క్రీడా నైపుణ్యాలు వెలికి తీసేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేస్తోందన్నారు. ఇక్కడి పాఠశాల హెచ్‌ఎంతో పాటు వ్యాయామ ఉపాధ్యాయుల విజ్ఞప్తి మేరకు రూ.60 వేలు జెడ్పీ నిధులతో అధునాతన క్రికెట్ కిట్ అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇప్పిలి వెంకటనరసమ్మ, జెడ్పీటీసీ వలిరెడ్డి శిరీష, సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పతివాడ రాజారావు, పాఠశాల హెచ్‌ఎం శ్యామలసాయి, పీఈటీ స్వరూప్ తదితరులు పాల్గొన్నారు.

రూ.2లక్షలతో సీసీ కాలువ నిర్మాణం



జోరుగా సీసీ కాలువ నిర్మాణ పనులు

గజపతినగరం: మండల కేంద్రంలోని కోవెల వీధి నుంచి బీసీ కాలనీ, జయంతి కాలనీ,దిగువ వీధి, ఎస్సీకాలనీలకు సంబంధించి మురుగనీటి కాలువ నిర్మాణ పనులను పంచాయతీ నిధులు రూ.2 లక్షలతో చేపడుతున్నామని పంచాయతీరాజ్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. సర్పం చ్ నరవ కొండమ్మ, వైస్ సర్పంచ్ కర్రి రామునాయుడు ఆధ్వర్యంలో గురువారం ప్రారంభించిన ఈ పనులను ఆయన పరిశీలించారు. కాలువ నిర్మిస్తుండడంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మోదీని గద్దె దించాలి..

విజయనగరం పూల్‌బాగ్: కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తున్న ప్రధాని మోదీని గద్దె దించాలని సీపీఐ, సీపీఎం నాయకులు పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా పట్టణంలో గురువారం ప్రచారభేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్ మాట్లాడుతూ, బీజేపీ పాలనలో దేశం సర్వనాశనం అవుతోందన్నారు. కార్పొరేట్లకు ప్రధానమంత్రి పీఏగా పనిచేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, ప్రసాద్, సత్తిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా ద్రోహి..

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆంధ్రా ద్రోహిగా మిగిలిపోయాడని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు రెడ్డి శంకరరావు ఆరోపించారు. కరకవలస ఇందిరమ్మకాలనీలో నిర్వహించిన సీపీఎం ప్రచారభేరి కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రాకు ప్రత్యేక హోదా ఇవ్వకుండా.. పోలవరం పూర్తి చేయకుండా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తీరని అన్యాయం చేస్తోందన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పి. రమణమ్మ, బుచ్చిబాబు, చక్రి, రమా, అమ్మాజమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి



బీటీ రోడ్డును ప్రారంభిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, నగర మేయర్

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- 13వ డివిజన్‌లో రూ.7.50 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు ప్రారంభం

విజయనగరం: అందరి సహకారంతో నగరాన్ని అభివృద్ధి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. నగరంలోని 13వ డివిజన్ కొత్తపేట నీళ్లట్యాంక్ జంక్షన్ నుంచి బ్రహ్మంగారి మఠం వరకు రూ.7.50 లక్షలతో నూతనంగా నిర్మించిన బీటీ రహదారిని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల గురువారం ప్రారంభించారు. అనంతరం అదే జంక్షన్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించి, చిన్నారులకు మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ ముచ్చు శ్రీనివాసరావు, పార్టీ నాయకుడు ఇసరపు రామకృష్ణ మాట్లాడుతూ, 13వ డివిజన్ కొత్తపేట ప్రాంతంలో 7.50 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన బీటీ రోడ్డు ప్రారంభం కావడం ఆనందంగా ఉందన్నారు. కొన్నేళ్లుగా రహదారి సౌకర్యం లేక ప్రజలు అనేక అవస్థలు పడ్డారన్నారు. విషయాన్ని కోలగట్ల దృష్టికి తీసుకెళ్లిన వెంటనే బీటీ రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకున్నారని చెప్పారు. సమస్యలు లేని డివిజన్లుగా తీర్చిదిద్దే లక్ష్యంతో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల అహర్నిశలు శ్రమిస్తున్నారని కొనియాడారు. కార్యక్రమంలో మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతీదేవి, పార్లమెంటరీ పార్టీ ప్రధాన కార్యదర్శి ముద్దాడ మధు, డివిజన్ కార్పొరేటర్లు బండారు ఆనందరావు, మారోజు శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు

- జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు



సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసరావు

చీపురుపల్లి: జగనన్న కాలనీల్లో ప్రభుత్వం కేటాయించిన ఇళ్ల నిర్మాణాలు త్వరితగతిన పూర్తిచేసే విధంగా హౌసింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నియోజకవర్గంలోని చీపురుపల్లి, గరివిడి, మెరకముడిదాం, గుర్ల మండలాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, హౌసింగ్ అధికారులతో గురువారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే ఇళ్ల స్థలాలు, పక్కా ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు అంతా ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించుకునే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఇళ్లు మంజూరైనప్పటికీ పనులు ప్రారంభించకపోతే అలాంటి వారికి ఇళ్లు రద్దు చేస్తామని అవగాహన కల్పించాలని సూచించారు. మండల స్థాయి నాయకులు, గ్రామ సర్పంచ్, ఎంపీటీసీలతో హౌసింగ్ అధికారులు సమన్వయం చేసుకుని నిర్మాణాలు పురోగతికి కృషి చేయాలన్నారు. ప్రధానంగా జగనన్న లేఅవుట్లలో శతశాతం ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాలుగు మండలాల వైఎస్సార్‌సీపీ నాయకులు కె.వి.సూర్యనారాయణరాజు, ఇప్పిలి అనంతం, వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, మీసాల విశ్వేశ్వరరావు, పొన్నాడ కుమార్, కొణిశ కృష్ణంనాయుడు, కోట్ల వెంకటరావు, బూర్లె నరేష్, పొట్నూరు సన్యాసినాయుడు, శీర అప్పలనాయుడు, హౌసింగ్ డీఈ గౌరీశంకర్, నాలుగు మండలాల ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

పేదల ఆర్థికాభివృద్ధికే పథకాలు

బొండపల్లి: పేదలు ఆర్థికంగా బలపడి, వారి జీవన ప్రమాణాలు మెరుగుపరచడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనరసయ్య అన్నారు. మండలంలోని చినతామరాపల్లి గ్రామంలో గురువారం ఆయన నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. గ్రామస్తులు ఆయనకు అడుగడుగునా పూలదండలు వేసి, హారతులు పట్టి ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పథకాల ద్వారా ప్రతీ కుటుంబం పొందిన లబ్ధిని ప్రజలకు వివరించి, సమస్యలు ఏమైనా ఉన్నాయా అని వారిని ఆరా తీశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వాలు అమలు చేయని విధంగా సీఎం జగన్ గొప్పగొప్ప సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని, అభివృద్ధి పనులు చేపడుతున్నారని, గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పిస్తున్నారని అన్నారు. అభివృద్ధి, సంక్షేమానికి సీఎం జగన్ సమప్రాధాన్యం ఇస్తుండడంతో ప్రజలంతా సంతృప్తిగా ఉన్నార న్నారు. నాడు–నేడు పథకంలో భాగంగా పాఠశాలలు, ఆస్పత్రుల రూపురేఖలు మారుస్తున్నామని, కార్పొరేట్ స్థాయిలో సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పారు. గడిచిన నాలుగేళ్లలో అవినీతికి తావులేకుండా ఆదర్శవంతమైన పాలన అందించామని, జగన్‌మోహన్ రెడ్డిని ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రభూజీ, జెడ్పీటీసీ రేపాక సూర్యప్రకాశరావు, ఎంపీపీ చల్ల చల్లంనాయుడు, ఏఎంసీ చైర్మన్ వేమలి ముత్యాల నాయుడు, మాజీ ఎంపీపీ బి.బంగారం, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఈదుబిల్లి కృష్ణ, సర్పంచ్ నడుపూరు భాస్కరనాయుడు, తహసీల్దార్ శ్రీనివాస్ మిశ్రా,ఎంపీడీఓ వేదవతి,నాయకులు గొల్లు సతీష్ తదితరులు పాల్గొన్నారు.